ఆత్మాభిమానం వున్న వాడెవడూ అలా చెయ్యడు. ఆ స్వామి దగ్గిర నేను చాలా సంవత్సరాలు పనిచేశాను. వాడిక్రింద పనిచెయ్యటం కష్టం.

విహారికి అర్థం కాలేదు ..... ఆత్మాభిమానం ఉన్నవాడు పనిచేయటం కష్టం అంటారు. తను చేశానంటాడు ..... ఈ రాజకీయాలు తనకు అర్థం కావు. ఆ విషయం ఒప్పుకున్నట్లు స్వామి ఆటలు సాగనివ్వకుండా మనం ఏం చెయ్యగలం? అనడిగాడు.

ఏమైనా చెయ్యగలం..... కుర్రవాడివి. నీకు రాజకీయం గురించి అంతగా తెలీదు. ఒక గొడవొచ్చి విడిపోయాక అప్పటివరకూ కలిసి పనిచేసిన వారిమీద బురద జల్లటాన్ని రాజకీయం అంటారు. చిన్న సంతకం పెట్టడం ఒక్కరోజు ఆలస్యం అయిందని ఆ ..... (బూతు మాట) కొడుకు ఒక ..... (మళ్ళీ ఒక స్త్రీలింగ బూతుమాట)ని పంపి నా మంత్రి పదవిని పోగొడతాడా? రేప్‌కేసు బనాయించి నన్ను అరెస్టు చేయించిన కృతజ్ఞత కూడా లేదు. తీసుకురా విలేఖర్లను అరగంటలో అరవయ్ ప్రశ్నలు తయారు చేసి వదుల్తా అన్నాడు ఆవేశంగా అయితే విహారి అక్కణ్నుంచి కదలలేదు. మీ మీ రాజకీయలకు నా పాదాభివందనం దేశం ఎందుకు మట్టిగొట్టుకు పోతోందో ఇప్పుడు అర్థమైంది. అయితే సమస్య మీరనుకున్నంత చిన్నది కాదు రెండ్రోజుల్లో ప్రళయం ప్రారంభం కాబోతూంది. మనకు ఇప్పుడు కావాల్సింది వాదోపవాదాలు ..... ప్రశ్నలూ జబాబులూ ఇవి కావు. స్వామి అసలు స్వరూపమైన తిరుగులేని సాక్ష్యాలు కావాలి.

అయితే వ్రాసుకో చెపుతాను అంటూ ఓ క్షణం కళ్ళు మూసుకుని చెప్పటం ప్రారంభించాడు స్వామి స్వీస్ బ్యాంక్ అకౌంట్ నెంబరు .....

విహారి టేప్‌రికార్డర్ ఆన్ చేశాడు.

*　　　　　*　　　　　*

విజయదశమి నాడు వచ్చే భక్తకోటి కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

దాదాపు రెండు లక్షల మంది వస్తారని అంచనా.

అంతా హడావుడిగా వుంది.

షిప్ దీవి దగ్గర బయల్దేరబోతూంది.

గాడ్జెట్ మిసైల్ రాజధానిలో పేలగానే పవిత్ర క్షేత్రాల్లో విస్ఫోటనం జరగ్గానే దాని ప్రభావం మిలటరీలో ఎంతమంది అధికారుల మీద వుంటుంది? ఒక మతస్థుల్లో అస్థిరత్వం దీనికెంత దోహదం చేస్తుంది అన్న ఎత్తుగడ తాలూకు ఆలోచనలో వున్నాడు స్వామి. సరిగ్గా అదే సమయానికి పరమేశ్వరం హడావుడిగా వచ్చాడు లోనికి.

స్వామి ఆనందంగా రా పరమేశ్వరం రా ఇదిగో రెండొందల టెలిగ్రామ్‌లు కోడ్‌లో వచ్చాయి చూడు అన్నాడు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపే టెలిగ్రామ్‌లు అవి. కమెండోలు దేశపు వివిధ ప్రాంతాలకు చేరుకున్నామని రెడీగా వున్నామని తెలిపే టెలిగ్రామ్‌లు అవి. ఇక్కడ స్వామి ఏ మతస్థులనైతే ఉద్దేశించి మాట్లాడాడో అదే మతస్థుల్ని మూకుమ్మడిగా వేర్వేరు

చేరుకున్నారు.

స్వామి తాలూకు ఆనందాన్ని పరమేశ్వరం గుర్తించలేదు. ప్రమాదం జరిగిపోయింది. సూర్యారావు పేపర్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు అన్నాడు.

స్వామి భృకుటి ముడిపడింది ఏమని? అడిగాడు.

మొత్తం అంతా ..... ఏ యే విదేశీ బ్యాంకుల్లో మనకు ఎంత వున్నది గోల్డెన్ ఐలెండ్‌లో జరుగుతూన్న కార్యకలాపాలు రేపటి ఉపన్యాసం ఉద్దేశ్యమేమిటి? జపాన్ నుంచి రాబోతున్న షిప్ గురించి.

స్టూపిట్ ..... అరిచాడు స్వామి అసలు ఇదంతా ఎలా జరిగింది? సూర్యారావు ఎందుకిలా చేశాడు? ఆవేశంతో వణికిపోతున్నాడు స్వామి. అతడు అంతలా కదిలిపోవడం ఇంతకు ముందెప్పుడూ చూడలేదు. ప్రళయకాల యముడిలా వున్నాడు.

సూర్యారావు సంతకం పెట్టడానికి ఒకరోజు ఆలస్యం చేశాడు. దాంతో మనకి కోపం వచ్చినట్టు అతడికి భ్రమ కలిగించాడు విహారి తరువాత ఒకమ్మాయిని పంపి అతడి పదవి పోగొట్టించాడు. ఆ అమ్మాయిని పంపింది మనమే అని అనుమానం వచ్చేలా చేశాడు. దాంతో సుర్యారావు రెచ్చిపోయి అంతా చెప్పేశాడు.

ఇప్పుడు మరేం చెయ్యాలి? స్వామి పెదాలు ఆవేశంతో వణుకుతున్నాయి. మొహం కందగడ్డలా తయారైంది. వానపాము అనుకున్న విహారి చూస్తూండగానే దుప్పట్లో మిన్నగయ్యాడు. అదీ ఇరిటెషన్.

పరమేశ్వరం ఆలోచిస్తున్నాడు.

తెలివితేటలు ఎత్తులకు పై ఎత్తులు ..... అన్నీ పరమేశ్వరానికి సంబంధించిన విభాగం.

రేపటి పేపర్లో ఇదంతా వస్తుంది. రాకుండా చెయ్యాలి. వీలైతే నగరంలో ఉన్న అన్ని వార్తా సంస్థల మీదా ఒకేసారి దాడి జరపాలి మనవంటూ రెండు పత్రికలు ఎలగూ వున్నాయి. మన గురించి ఎవరో ఎక్స్ మినిష్టర్ చెప్తే అన్నీ వేసెయ్యరు. రుజువులు కూడ ఇచ్చి ఉంటాడు. ఆ రుజువులు ఏమిటో తెలుసుకోవాలి. వాటిని వార్తా సంస్థల్నుంచి వెనక్కి తిరిగి సంపాదించాలి. కావలిస్తే మారణహోమం చేసైనా సరే ఆ పావుల్ని నాశనం చెయ్యాలి. అదంతా ఈ రాత్రికే జరగాలి ఒకటి రెండు చిన్న పేపర్లు ప్రచురించినా పెద్ద పత్రికల్ని కంట్రోలు చెయ్యాలి సూర్యారావు నోరు శాశ్వతంగా మూసెయ్యాలి ..... పరమేశ్వరం కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ చెప్పుకుపోతున్నాడు ..... అన్నింటికన్నా ముఖ్యంగా ప్రజల్లో బాగా నమ్మకం పెంచుకోవాలి దీనికోసం వీలైతే విజయదశమి నాడు ప్రజల ముందు అగ్ని ప్రక్షాళనం జరిగేలా చూసుకోవాలి?

అగ్ని ప్రక్షాళనమా?

మన జాతికి మన మతానికి జరుగుతున్న అన్యాయానికి ప్రతీకగా ఆ రోజు మీరు అగ్నిలో ప్రవేశించి అగ్నిలో స్నానం చేసి బయటకు వస్తారు. చాలా సింపుల్‌గా యజ్ఞవేదిక మీద

రెండు నిమిషాలుండి రావొచ్చు. చూసే అనంతకోటి ప్రజలకు మీరు తమకోసం అగ్నిప్రవేశం చేసి వచ్చినట్టే భ్రమ కలుగుతుంది. క్రింద నుంచి ఆ ఏర్పాట్లు నేను చేయిస్తాను. దాంతో భారతదేశమంతా మీ ఖ్యాతి రెట్టింపవుతుంది. మీరు దివ్య పురుషుడిగా అవతార మెత్తుతారు. మిలటరీని చెప్పు చేతల్లోకి తీసుకోవటానికి ఇది బాగా ఉపయోగపడుతుంది.

స్వామి సంతృప్తి చెందాడు గుడ్ ఈ ఏర్పాట్లన్నీ నువ్వు చెయ్యి అంటూ లేచాడు.

నేనిప్పుడే ఆస్పత్రికి మన మనుష్యుల్ని విలేఖర్ల రూపంలో పంపిస్తాను. ఇంకో గంటలో సమావేశం వుంది. సూర్యారావు విలేఖర్లని ఆహ్వానించాడు.

రామ్‌లాల్ ఎక్కడున్నాడు? ఇటువంటి సమయంలో మాయమయ్యాడేమిటి?

ఈ గొడవలో నీ కొడుక్కు ప్రమాదం ఏర్పడకుండా చూడు నాకతడు ప్రాణాల్తో కావాలి అతడు మామూలుగా మరణించటం నాకిష్టం లేదు.

పరమేశ్వరం తలూపి అక్కణ్నుంచి వెళ్ళటానికి సంసిద్ధుడయ్యాడు.

అన్నట్టు ఇదెలా జరిగింది? హఠాత్తుగా స్వామి అన్నాడు పరమేశ్వరం ఆగాడు.

సూర్యారావుకి కేవలం మన ఆర్థికపరమైన విషయాలు మాత్రమే తెలుసు టెర్రరిజం గురించి అన్ని వివరాలు తెలియవు.

సూర్యారావుకి గోల్డెన్ బీచ్ గురించిన వివరాలు వగైరా తెలియవు ఇంత వివరంగా బయటపడ్డాయంటే తమలో అతి ముఖ్యమైన వ్యక్తి అవతలి పక్షానికి చేరవేసి వుండాలి.

అతను ఎవరు ..... ఎవరు?

* * *

రాత్రి పదకొండు అయింది రామ్‌లాల్ నిద్రపోవటం లేదు. అతడికి భార్యా పిల్లలు కూడా గుర్తురావటం లేదు. ఆ వేడి తగ్గిపోయింది. తన ప్రాణాల గురించి సమస్య ఎక్కువైంది. ఒకప్పుడయితే ప్రపంచం మొత్తం ఎదురయినా భయపడేవాడు కాడు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. కదల్లేడు.

ఆపరేషన్ పోస్ట్ ఫోన్ అయింది. ఈ టెన్షన్‌లో ఆపరేషన్ వద్దని డాక్టర్ దయానంద కృష్ణమూర్తి అన్నాడు. మార్చురీలో భార్యాబిడ్డలు అలాగే వున్నారు శవాలై.

ఇంకొక మూడు రోజుల్లో స్వామి నిర్వీర్యం అయిపోతాడనీ ఆ తరువాత భయం వుండదని విహారి చెప్పాడు. కొన్ని రోజులపాటు అజ్ఞాతవాసం తప్పదు అన్నాడు. కానీ స్వామి ఎంత పవర్‌ఫుల్ మనిషో రామ్‌లాల్‌కి తెలుసు. విహారి లాంటివాడు అతన్ని ఎదుర్కోలేడు.

ఆపరేషన్ అవగానేవ జాగ్రత్తగా దాన్లో డబ్బు తీసేసుకుని ఏదైనా విదేశానికి పారిపోవాలి. విహారి చెప్పిన దాన్లో కొంతవరకు నిజం వుంది. తనకి చాలా రహస్యాలు తెలుసునని వాళ్ళకి తెలుసు. బ్రతకనివ్వరు. ఈ లోపులో విహారి చెప్పినట్లు స్వామి అణగారిపోతే అసలు గొడవే లేదు. అదృష్టవశాత్తు తన దగ్గర జీవితాంతం ఏ కష్టమూ లేకుండా బ్రతికేటంత డబ్బు వుంది.

ఆలోచిస్తూనే కళ్ళు మూసుకున్నాడు.

పన్నెండయింది. దూరంగా గడియారం గంట కొడుతూ వుండగా తలుపు దగ్గర చప్పుడయింది.

రామ్‌లాల్ చెవులు రిక్కించి విన్నాడు.

మళ్ళీ చప్పుడయింది.

అతడి గుండె వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది చప్పున లేచి కూర్చున్నాడు.

తను ఇక్కడ ఈ ఆస్పత్రిలో వున్న విషయం రహస్యంగా వుంచుతానన్నాడు విహారి అది సాధ్యం కాని పని స్వామి ఎలాగో పట్టుకోగలడు.

బట్టల్ని తీసుకొచ్చే ట్రాలీలో తను వెళ్ళి ఒక మనిషిని చంపేడు. ఇప్పుడు తను వెళ్ళి మన మనిషిని చంపేడు. ఇప్పుడు తనని చంపటానికి ఎవరొస్తున్నారో.

బయట ఏదో లాగిన శబ్దం.

డ్యూటీ నర్స్ ఎక్కడుందో తెలియటం లేదు. అతడి మొహం మీద చెమట జుట్టులోంచి ధారాపాతంగా కారుతోంది. మృత్యువు తలుపు దగ్గిర నిలబడినట్టు ఉంది. అతడికేం చెయ్యాలో తోచలేదు. అంతలో శబ్దం మరింత ఎక్కువైంది. మరింత దగ్గిరగా వచ్చింది.

అతడు లేచి నిలబడ్డాడు. పక్కనే టేబిల్‌మీద వున్న సీసా చేతిలోకి తీసుకున్నాడు. శబ్దం కాకుండా గుమ్మం దగ్గిరకి వచ్చి బయటకు తలపెట్టి చూశాడు. వరండాలో ఖాళీగా వుంది దూరంగా ఒక మూల నర్సు టేబిల్ మీద తలపెట్టి నిద్రపోతూంది. మళ్ళీ ఏదో లాగిన చప్పుడు అతడు క్రిందకి చూశాడు. బెదిరిపోయిన ఎలుక లాగుతూన్న డబ్బా మూతని వదిలేసి పరిగెత్తింది. ఒక్కసారి భారంగా విశ్వసించి మొహం తుడుచుకో బోయి తన భయానికి తనే నవ్వుకోబోతూ ఏదో స్ఫురించినట్టు స్తబ్ధుడయ్యాడు.

తను నడిచి వచ్చాడు తను ..... న ..... డి ..... చి వచ్చాడు.

అతడు చప్పున కాళ్ళ వైపు చూసుకున్నాడు.

బ్యాండేజీలు అలాగే వున్నాయి. ఒక ఉక్కు మనిషి సినిమాలో నిలబడ్డట్టు వున్నాడు.

అతడి కాళ్ళు రెండూ బలంగా నేలకేసి కొట్టి చూశాడు. కాస్త నొప్పిగా అనిపించిన మాట వాస్తవమే గానీ కాళ్ళు స్వాధీనంలోనే ఉన్నాయి. వెళ్ళి మంచం మీద కూర్చుని పాదాలను స్పృశించాడు బ్యాండేజీలోంచి బయట కొచ్చిన పాదాలు తెల్లగా కనపడుతున్నాయి కానీ స్పర్శ తెలుస్తూంది.

ఒక నిశ్చయానికి వచ్చినట్టు అతడు కాళ్ళు పక్కమీద చాపి బ్యాండేజీ విప్పటం మొదలు పెట్టాడు. అయిదు నిముషాలయ్యేసరికి కాళ్ళు రెండు బయటపడ్డాయి.

మామూలుగా వున్నాయి.

కారు ఎక్కినచోట ఎర్రగా కమిలింది. కనీసం ఫ్రాక్చర్ కూడా లేదు. మారుతీకారు ..... అయినా భయంతో స్పృహతప్పి వుంటుంది వెనుక వచ్చిన ప్రవల్లిక క్లోరోఫాంతో .....

అతడు సిగ్గుగా ఆలోచించలేదు.

పరుగెత్తాడు.

గదిలోంచి బయటకొచ్చి వరండాలో శబ్దం కాకుండా నడిచి బయటపడ్డాడు. ఆస్పత్రి నిద్రలో వుంది. దూరంగా విసిరేసినట్లు బ్లాకులున్నాయి.

అయిదు నిమిశాల్లో ఇల్లు చేరుకున్నాడు. అక్కడ జీపు వుంది. వెంటనే స్వామి దగ్గరకు వెళ్ళాలనుకున్నడు. పోయాయనుకున్న కాళ్లు తిరిగి రావటంతో అతడి గుండెల్నిండా ఆనందం నిండి అది యోచనా శక్తిని కోల్పోయింది తన నుంచి రహస్యాలు రాబట్టాక విహారి ఇక తన కాళ్ళ గురించి పట్టించుకోలేదన్న విషయం రామ్‌లాల్ గుర్తించలేదు. తన వాళ్ళని కలుసుకోవటానికి తొందరపడుతున్నాడు.

ఇంటి ముందు తాళం వేసి లేదు.

తనింట్లో ఇంత అర్థరాత్రి ఎవరున్నారు అని ఆశ్చర్యపోతూ తలుపుకొట్టాడు.

*　　　　　　　　*　　　　　　　　*

తనుచేసే పనులు చాలా వరకూ స్వామికి తెలుస్తూనే ఉంటాయని విహారికి తెలుసు. అందులోనూ సుర్యారావులాంటి మినిష్టర్ పత్రికా విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేస్తే అది స్వామికి క్షణాల్లో తెలుస్తుంది.

విలేఖర్ల రూపంలోనే ఒక టెర్రరిస్టు సమావేశం మధ్యలో సూర్యారావుని కాల్చేసినా అశ్చర్యపోనవసరం లేదు.

అందువల్ల సుర్యారావు పత్రికకి ఇవ్వవల్సిన స్టేట్‌మెంట్‌లని రెండు వేర్వేరు సెట్లు చెయించాడు. ఒక దాంట్లో కేవలం అరోపణలే వున్నాయి అవి విలేఖర్లకు అందజేశాడు.

విహారి వూహించిన విధంగానే ఆ సెట్లు క్షణాల్లో పరమేశ్వరానికి చేరింది. అందులో అపాయకరమైన విషయాలు ఏమీలేవు. పరమేశ్వరం జాగ్రత్తగా దాన్ని పరిశీలించాడు.

ఆ ఆరోపణలు పేపర్‌లో వచ్చినా స్వామికొచ్చే ప్రమాదం ఏమీ లేదన్న నిర్ణయానికి వచ్చాడు. సూర్యారావు యిటువంటి తేలికయిన స్టేట్‌మెంట్ ఇవ్వటానికి కారణం తను వూహించగలిగాడు. స్వామి హీన చరిత్రలో సగం పైగా సుర్యరావుకి భాగం వుంది. స్వామి గురించి బయటపడితే సూర్యారావు చరిత్ర కూడా సమాప్తమవుతుంది. అందువల్ల సూర్యారావు భయపడ్డాడేమో అనుకున్నాడు. కేవలం ఒకరాయి విసిరి చూద్దాం తగిల్తే తగుల్తుందని సూర్యారావు ఈ విధంగా పేపర్ స్టేట్‌మెంట్ ఇచ్చి వుంటాడనీ తనక్కూడ అపాయం జరిగేలా ఏ పనీ చేయడనీ భావించాడు.

సూర్యారావు లాంటివాళ్ళు తాము జారిపోవటం ప్రారంభిస్తే అవతలి వాళ్ళని కూడా లోయలోకి లాగుతారని వూహించలేకపోయాడు.

సమావేశంలో మొదటి స్టేట్‌మెంట్ విలేఖర్లకి ఇచ్చాక విహారి ముఖ్యమైన పత్రికల ప్రధాన సంపాదకుల్ని కలుసుకుని రెండో స్టేట్ మెంట్ రుజువుల్తో సహా అందజేశాడు.